వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-నిడదవోలు: మద్యపానం గుట్కా,గంజాయి వంటి మత్తు వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిషత్తు విద్యార్థులదేనని ఎస్సై నాగరాజు అన్నారు. నిడదవోలులోని ఎస్ఎఫ్ ఎస్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు, పదార్థాల వాడక, వాటిరవాణా వలన కలిగే నష్టాలు, హెల్మెట్లవాడకం,ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత, ఆన్లైన్ యాప్స్ వినియోగం, విద్యార్థుల భవితకు ఆటంకం కలిగించే పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశనుండే చట్టాలపై అవగాహన కలిగిఉన్నప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని నిడదవోలు ఎస్సై పి.నాగరాజు తెలిపారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని తెలియజేశారు.మైనర్ బాలికలను ప్రేమ పేరుతో వేధిస్తే వారికి కఠినమైన శిక్ష పడుతుందని పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.విజయశేఖర్,లెక్చరర్స్ సుజాత, అప్పారావు, పిసిడి వీర్రాజు,మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఎండి షకీరా భాను, కే పోసిప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

'వికాస'లో 6న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈనెల 6వ తేదీ సోమవారం "జాబ్‌మేళా" నిర్వహించనున్నారు. ఈ జాబ్‌మేళాలో విప్రోలో నాన్‌వాయిస్ ప్రోసెస్, హోమ్‌కంఫర్ట్స్ ఫర్నిచర్‌లో అకౌంట్స్, సూపర్‌వైజర్, కెపిటల్ కన్సల్టెన్సీలో టెలికాలర్స్, నిట్(ఐసిఐసిఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డక్కన్‌కెమికల్స్‌లో ట్రైనీ, హోండాయ్ మోబీస్‌లో టెక్నిషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్‌నీడ్స్, కామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. డియుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి నుండి పిజి వరకు ఉత్తీర్ణులైన 35సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.10,000 నుండి రూ.25,000 వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 06వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికేట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 8297400666, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. వికాసజాబ్స్.కాం సంప్రదించవలెను.

ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం కాల రాస్తోంది

విశాలాంధ్ర - కొత్తపేట : ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యానందరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాటలను, మేనిఫెస్టోలో పొందుపరచిన వాటిని మాట తప్పి మడమ తిప్పారని దుయ్యబట్టారు. ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు సాక్షాత్ పరబ్రహ్మ అని భావించే మన సమాజంలో ఉపాధ్యాయులను జగన్ ప్రభుత్వంలో మద్యం షాపుల వద్ద డ్యూటీలు వేసిన రోజే ఉపాధ్యాయులను కించపరిచారని సత్యానందరావు విమర్శించారు. ఉద్యోగుల డిమాండ్లను గాలికి వదిలేసి పోరాడుతున్న వారిని నిర్బంధించి బెదిరింపులకు గురి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మిద్దె ఆదినారాయణ, బూసి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, సిద్దాబత్తుల బహదూర్, విళ్ళ మారుతీ పాల్గొన్నారు.

సుప్రజకు బాక్సింగ్‌లో సిల్వర్ మెడల్

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి పరస పద్మరాజారావు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఇటీవల రాజమహేంద్ర వరంలో జరిగిన పోటీలలో ప్రతిభను కనబరిచారని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మూర్తి తెలిపారు. అండర్ 17 క్రింద 80 కేజీల విభాగంలో 10 వ తరగతి చదువుతున్న సాధనాల సుప్రజ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి రెండవ స్థానం లో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. స్టేట్ మీట్ కి కొడమంచిలి సందీప్ కబడ్డీలో, గోళ్ళ సంతోష్ , మాత బోయిన పండు వీరిరువురు త్రోబాల్‌లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. సుప్రజను, పిడి శ్రీ లక్ష్మిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీనివాస కళాశాలలో 69 మందికి ప్రాంగణ ఎంపిక

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ నియామకాల్లో కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరి చారు. స్లాష్ కియా సంస్థకు చెందిన ఎం. ఆనంద్ భాస్కర్, అశ్వథా ప్రతినిధుల బృందం కళాశాలలో విద్యార్థుల సంబంధిత సబ్జెక్టుల్లో గల విశ్లేషణ సామర్థ్యంను, విషయ పరిజ్ఞానాన్ని ఆన్లైన్ పరీక్ష ద్వారా అద్భుత ప్రావీణ్యం కనబరిచిన వారిని మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేసారు. ఈ నియామకముల ద్వారా మొత్తం 69 మందికి విద్యార్థినీ విద్యార్థులకు నియామక పత్రములు అందచేశారు. ఈ ప్రాంగణ నియామకాలలో విజేతలైన విద్యార్థుల్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్ వర్మ, ప్రతేకంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి రత్నరాజు, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్ రాజు, కళాశాల టిపిఓ బి అరుణ్ కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దాళ్వాలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లింగంపర్తి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు దాళ్వా వరి సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన సద స్సును నిర్వహిం చారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి బి. జ్యోతి మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి గుర్తించినట్టు తెలిపారు. ప్రస్తుత దాళ్వా వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి కాండం తొలిచిపురుగుని నివారించుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో లింగంపర్తి పరిసర ప్రాంతాలలో చాలాచోట్ల కాండం తొలుచు పురుగు ఆశించిందని దీనికి గల కారణాలు తెలియజేస్తూ సార్వ దాల్వ పంటల మధ్య కాలవ్యవధి తక్కువగా ఉండటం వలన పాత సీజన్‌లోని వరిమొళ్ళు సక్రమంగా కుళ్ళలేదన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. చిరుపొట్ట దశలో కర్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు ఎకరాకు లేదా కార్బో ఫొరన్ 3జి గుళికలు 10 కిలోలు ఎకరాకు చొప్పున ఇసుకతో కలిపి వెదజల్లి పలుచగా నీరు అక్కడక్కడ కాండం కుళు ళ్ళ తెగులు కనిపించిందని అడపాదడపా నీరు పెట్టాలని నివారణకు ట్రైసో కొనజోలు 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లింగంపర్తి సొసైటీ చైర్మన్ చిక్కాల లక్ష్మణరావు, వడ్డీ నాగదుర్గ, ఆర్‌బికే సిబ్బంది సత్య దుర్గ, జలజ రైతులు, బోర్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్ అమరజీవి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం స్థానిక సినీ కళాకారుల కళాపోషకులు ఆధ్వర్యంలో స్థానిక అమలాపురం గడియార స్తంభం వద్ద కళాతపస్వి కె. విశ్వనాథ్ మృతి పట్ల కళాకారులు సినీ ప్రముఖ ఆర్టిస్టులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కళామతల్లి ముద్దుబిడ్డని, శాస్త్రీయ సంగీత రాష్ట్ర జాతీయస్థాయిలో, నిలిపిన ఖ్యాతి కే విశ్వనాథ్‌కే దక్కుతుందని, ఆయన తీసిన చిత్రాలు నేటికీ స్థిర స్థాయిగా ఉంటాయని శంకరాభరణం స్వాతిముత్యం, స్వయంకృషి వంటి చిత్రాలు నిర్మించటంలో ఆయనకాయనే సాటి, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు, అనేక అవార్డులను పొందిన వ్యక్తి, నేటి కళాకారులు ఆయన స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ సూర్య మోహన్ రావు, గుర్రం రామకృష్ణారావు, చల్లా రమణ, నామన దుర్గారావు, డిఎస్ఎన్ కుమార్, దేవాదుల సూర్య నారాయణమూర్తి, గొల్ల కోటి హరికృష్ణ, కారుపర్తి భద్రాజీ, మట్ట మాధవ గౌడ్, గున్నేపల్లి భీమశంకరం, కర్రీ శ్రీహర్ష, నవీన్ కుమార్, కే విజయకుమార్, ఎం. సుదర్శన్‌రావు, సంతోష్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడి

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. బి. బాగ్చి, ఆదేశాల మేరకు ఎస్.పి. పి.వి.రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజి అధికారులతో కలిసి సంయుక్తంగా కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలలో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పట్టణంలోని శివ శక్తి ఎంటర్ప్రైజెస్ ఎరువుల దుకాణంను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు స్టాక్ నిల్వలలో వ్యత్యాసాలు వున్నందున, గరిష్ట అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు అమ్మకము చేయుట వలన మండల వ్యవసాయ అధికారి, అమలాపురం వారు సదరు షాపు పై 6-ఏ క్రింద కేసు నమోదు చేసి రూ. 71,671 విలువైన సుమారు 2.645 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పట్టణంలోని శ్రీ శివ సాయి అగ్రో ఇన్ పుట్స్ ఎరువుల దుకాణంను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు సదరు షాపులో స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించకపోవుట స్టాక్ నిల్వలలో వ్యత్యాసములు వున్నందున మండల వ్యవసాయ అధికారి, పిఠాపురం వారు సుమారు రూ 3,94,382/ విలువ గల 16.125 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని పెరవలి మండలములోని ఖండవల్లి గ్రామంలోని శ్రీ ధనేశ్వరి ట్రేడర్స్ ఎరువుల దుకాణంను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు సదరు షాపు నందు స్టాక్ రిజిష్టర్లు సక్రమముగా నిర్వహించకపోవుట స్టాక్ నిల్వలలో వ్యత్యాసములు వున్నందున మండల వ్యవసాయ అధికారి, పెరవలి వారు సుమారు రూ. 2,50,639 విలువ గల 15.285 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని పెరవలి మండలములోని ఖండవల్లి గ్రామంలోని డిసిఎంఎస్, ఖండవల్లిని తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు సదరు షాపులో స్టాక్ నిల్వలలో వ్యత్యాసములు వున్నందున మండల వ్యవసాయ అధికారి, పెరవలి వారు సుమారు రూ.5,19, 973 విలువ గల 24.19 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలుపుల చేశారు. ఈ తనిఖిలలో డి.ఎస్.పి ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్స్పెక్టర్ రమేష్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర

-జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి

-పిఐబి ఆధ్వర్యంలో అమలాపురంలో వార్తాలాప్ నిర్వహణ

విశాలాంధ్ర - అమలాపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు చేర వేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తోందని అమలాపురం మునిసిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి), విజయవాడ ఆధ్వ ర్యంలో అమలాపురంలో, శు క్రవారం పాత్రికేయులతో 'వార్తాలాప్' ఒకరోజు వర్క్ షాప్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా, గ్రామీణ స్థాయిల్లో పనిచేస్తున్న పాత్రికేయులు ప్రజల్లో సానుకూల దృక్పథం కల్గించే వార్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రత్యేక అతిధిగా పాల్గొన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు వాస్తవ వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నేర పరిశోధనలో కేసుల పరిష్కారానికి మీడియా సహకారం ఎంతో విలువైనదని అన్నారు. జర్నలిస్టులు డెవలప్మెంట్ రిపోర్టింగ్ సంబంధిత వార్తలకు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వాలని తద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించినట్లవుతుందని తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరక్టర్ జిడి హల్లికేరి మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం చేసే ప్రతి పనికి సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా ప్రజలకు, పత్రికలకు చేరవేసే సమాచార మాధ్యమంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విధులు నిర్వహిస్తోంద న్నారు. మునిసిపల్ కమీషనర్ అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా నాలుగో స్తంభంగా ఎనలేని పాత్ర పోషిస్తోందని అన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ పీమేవై, ముద్ర యోజన, మొదలైన ప్రభుత్వ పథకాల ద్వారా లబ్దిదారులు ఏవిధంగా అభివృద్ధి చెందుతోంది వివరించారు. ఐసిడిఎస్ పిడి సత్యవేణి, డిఆర్డిఏ పిడీ శివశంకర ప్రసాద్, జిలానీ, డిఐపిఆర్ఓ లక్ష్మీ నారాయణ రెడ్డి, ఏఈ అమలాపురం మునిసిపల్ కార్పొరేషన్ హేమంత్ వారి శాఖల ద్వారా అందిస్తోన్న ప్రభుత్వ పథకాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 180 మంది విలేకరులు, పిఐబి మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి టి హెన్రీరాజ్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఉభయ గోదావరి జిల్లాల అధికారి శ్రీరామమూర్తి, కందాళ (కెఎస్ఆర్ మూర్తి), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సత్వర సేవలు అందించాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని సచివాలయం సిబ్బంది తమకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు సత్వర సేవలు అందించా లని అమలాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి పి.విజయ థామస్ సూచించారు. శుక్రవారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై డివిజనల్ అధికారి ఆరా తీశారు. బయోమెట్రిక్ అటెండెన్స్, స్పందన, ఆధార్ సేవా కేంద్రాలు, ఆయుష్మాన్ భారత్, రేషన్ కార్డులు, పెన్షన్లు, కళ్యాణమస్తు తదితర ఏపీ సేవ సేవలపైన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. కామేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్(హౌసింగ్) కె సుబ్రహ్మణ్యం, ఏఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

విశాలాంధ్ర -నిడదవోలు: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన్ సమాజ్ పార్టీ పనిచేస్తుందని బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు బి.పరం జ్యోతి అన్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జనవరి 26 నుండి ఫిబ్రవరి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చైతన్య యాత్ర శుక్రవారం నిడదవోలు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఏబిఎస్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు బీఎస్పీ రాష్ట్రనాయకులు పాల్గొన్నారు. పి.విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు డిఎస్పి నాయకులు మాట్లాడుతూ ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. మోడీ ఆధ్వర్యంలోని బీజేపీ పాలనలో దేశంలోని బహుజనులు చాల క్లిష్టపరిస్థితిలో ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీని గెలిపించి బహుజనుల వ్యతిరేక పార్టీలను సాగనంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్స్ బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే ఎల్.రాజారావు మల్లికల్, గద్దం సంపత్ రావు, గుమ్మాపుచిత్రసేన్, తిరుపతిరావు,కొల్లా బత్తులసత్యం, పి. కనకమహాలక్ష్మి స్థానిక నాయకులు వెన్నాపు సుధాకర్, బయ్యే మునీంద్ర, తాడేపల్లి రాజన్ బాబు ,అంబటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు అనంతరం ఈ యాత్ర ఏలూరుకు బయలుదేరింది.ముందుగా ఫూలే, అంబేడ్కర్,కాన్షీరాం చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.

పేదల సంక్షేమమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : పేద ప్రజల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడు వారి పాలెం సచివాలయం పరిధిలో 16వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో 16వ వార్డు బొక్కవారి పాలెం, టీటీఆర్ నగర్‌లో ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబంలో లబ్దిదారులకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, వైస్ చైర్మన్లు, పి చిట్టి రాజు, జడ్పిటిసి కుడుపూడి శంకర్రావు, మండల పరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జి, టౌన్ అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్స్ ,నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనతో ప్రతిభకు పట్టం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతిభను ప్రోత్సహిస్తూ అర్హులైన విద్యార్థులకు సంతృప్త స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలుచేస్తున్నట్లు కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్ నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ డా కృతికా శుక్లా, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి అమ్మాజీ, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె రంగలక్ష్మీదేవి తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాలోని లబ్ధిదారుల తల్లిదండ్రులకు ఎంపీ వంగా గీత, కలెక్టర్ డా కృతికా శు క్లా..ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మెగా చెక్‌ను అందించారు.

విద్యా, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

విశాలాంధ్ర - చాగల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారని రా ష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా మంత్రి తానేటి వనిత చాగల్లు మం డలం నెలటూరు గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భం గా మంత్రి మాట్లాడు తూ పేద వర్గాల ప్రజల అభి వృద్ధి లక్ష్యం గా సంక్షేమ ఫలాల ను అర్హులైన ప్రతి ఒక్కరికి అం దిస్తున్నామ న్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్ ల్లో వైద్యం నకు ధీటుగా ప్రభు త్వ ఆసుపత్రి ల్లో ఆధునిక పరిక రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గం లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు - నేడు పథకం ద్వారా మౌళిక వసతులు కల్పించి ఆధునీకరించడం జరుగుతోంద న్నారు. విద్యా వ్య వస్థలో సమూల మార్పులకు ము ఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వల్లభనీ గంగాధర శ్రీనివాస్ కొవ్వూరు నియోజకవర్గ నాయకులు, ఎంపీడీవో బి. రామ్ ప్రసాద్, మండల స్థాయి అధికారులు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే అర్హతగా సంక్షేమం

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం పేద, బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించి నవరత్నాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి వివక్షతకు తావు లేకుండా పేదరికమే అర్హతగా పారదర్శకంగా అమలు చేస్తోందని, వాటిని అర్హత కలిగినవారు అందిపుచ్చుకొని జీవన ప్రమాణాలు మెరుగుపర చుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలో గొడి, గోడిలంక గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికి పర్యటించి ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత మూడు సంవత్సరాలలో ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రయోజనం చేకూర్చుతున్నా మన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకు, రాజకీయా లకు అతీతంగా అర్హులకు పథకాలను వర్తింపు చేస్తున్నామన్నారు. వాసర్ల శ్రీరామ అనే దివ్యాంగురాలిని ఆప్యాయంగా పలకరించి పింఛన్ అందుతుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తున్న ఘనత జగన్‌దే

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులుకు ఘన స్వాగతం లభించింది. వైయస్సార్ గ్రామ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు ప్రతి ఇంటికి వెళ్ళి, సీఎం జగన్ పాలనలో అందిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలులో ఏమయినా సాంకేతిక ఇబ్బందులు వలన అందకపోతే ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకొని వస్తే వార్డు వాలంటీర్‌లు, సచివాలయం సిబ్బందికు పరిష్కారం చేయవలసిందిగా ఆదేశిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు వున్న సామాజిక సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని తోట తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేని దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, పుట్టా కిట్ట బాబు, ఎంపీటీసీ టేకి సత్య మంజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మూడు లక్షల కోట్ల అవినీతి సొమ్ము సీఎం ఇంటికి

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : రాష్ట్రంలో దొంగలు పడ్డారు మూడు లక్షల కోట్లు అవినీతి సొమ్ము జగన్ ఇంటికి చేరింది దీనిపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలి అని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎటు చూసినా జగన్ సార థ్యంలో దోపిడీకి అవినీతికి అంతే లేదు అని,భారతి సిమెంట్స్ పేరిట దోపిడీ ప్రారంభించారు అని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని అధిక ధరలు ఈ రాష్ట్రంలో అదనపు ధరలతో దోపిడీ చేస్తున్నారు అని ఒక వైపు ఇసుక, మరో వైపు మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోందని, రసీదులు లేకుండా ఇసుక ఆదాయం తాడేపల్లి సిఎం ఇంటికి వెళ్తోంది అని గోరంట్ల మండిపడ్డారు. లిక్కర్ లో లక్ష కోట్లు, మైనింగ్ ద్వారా రెండు లక్షల కోట్లు , సిమెంట్, ఇసుక, లిక్కర్, మైనింగ్ ద్వారా మూడు లక్షల కోట్లు సీఎం ఖజానాకు వెళ్లాయి అని ప్రశ్నించే వారిపై జీవో వన్ ప్రయోగం చేస్తున్నారని ఆయన అన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

విశాలాంధ్ర - సీతానగరం/కోరుకొండ : నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు రేఖలు వచ్చాయని రాజా నగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం నందు వివిధ గ్రామాలలో పలు ప్రారంభోత్స వాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే పేదల జీవితాల్లో సంపూర్ణ మార్పు సాధ్యమవుతుందని త్రికరణ శుద్ధిగా నమ్మిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యారంగం అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రీ నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

తినేష్‌ను పరామర్శించిన హోం మంత్రి వనిత

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దేవాగుప్తాపు చాందిని కుమారుడు తినేశ్ ను హెూంమంత్రి డాక్టర్ తానేటి వనిత పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తినేశ్ కాలికి గాయమయ్యింది. హాస్పిటల్ లో చికిత్స అనంతరం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కొవ్వూరు లోని కౌన్సిలర్ చాందిని నివాసానికి హెూంమంత్రి వనిత వెళ్లి బాలుడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వనిత పాటు స్థానిక వైస్సార్‌సీపీ నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

డ్రైన్ కట్టండి మహాప్రభో

విశాలాంధ్ర - తాళ్లపూడి : అన్నదేవరపేట గ్రామం లో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తున్న సిసి రోడ్డు డ్రైన్ ను తలపిస్తున్నది. మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో గల బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి గ్రామంలోకి వెళ్లే దారిలో ఆప్రాంత ప్రజలు డ్రైనేజీని ఆక్రమించి కట్టడాలు చేపట్టారు. డ్రైనేజీ పూర్తిగా పూడుకు పోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. చుట్టుపక్కల ప్రజలు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురికి నీరు నిల్వ ఉండిపోవడంతో అనేక అనారోగ్యాలకు దారితీస్తున్నాయని చుట్టుపక్కల ప్రజలు వాపోతున్నారు. దీనిపై అన్నదేవరపేట పంచాయతీ కార్యదర్శి వీరన్నను వివరణ కోరగా నూతన డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. త్వరలో నిర్మాణం చేపడతామని తెలిపారు. సర్పంచ్ సుధారాణి మాట్లాడుతూ ప్రజావాసరాలను గుర్తించామని, త్వరలో పనులు చేస్తామన్నారు.

సన్మానం

విశాలాంధ్ర - తాళ్లపూడి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా స్థాయిలో అవార్డ్ తీసుకున్నందుకు తహసీల్దార్ రాధికను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సహాయ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వర రావు జిల్లాలో ఉత్తమ ఉద్యోగిగా రిపబ్లిక్ డే రోజున కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నందుకు వారిని కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లాల్ అహ్మద్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ భారతి ఆర్.ఐ క్రాంతి రేఖ,సీనియర్ అసిస్టెంట్ రత్న కిషోర్, వి.ఆర్.ఓ లు కావూరి నాగేశ్వర రావు, సంజీవరావు, లీలా వతి, సుజాత, సుభాషిణి, ప్రవీణ్, రవి, వి.ఆర్.ఏ లు సురేష్, భాగ్యలక్ష్మి, గ్రామ సర్వేయర్స్ వినీల్, ప్రియ, సంధ్య పాల్గొన్నారు.

డమ్మీలుగా మిగిలిన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - అనపర్తి : నేనే రాజు నేనే మంత్రి రీతిలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని సంక్షేమం, అభివృద్ధి నా వలనే జరిగిందనే విధంగా ఎమ్మెల్యేలను డమ్మీలుగా మార్చారని మాజీ హెూం మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 14,15,16 తేదీల్లో అనపర్తి, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో జరిగే చంద్రబాబు పర్యటన పురస్కరించుకొని రూట్ మ్యాప్, సమావేశ స్థలాలపై చిన్న రాజప్ప, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చర్చించి, పరిశీలించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఎన్నికైతే సమస్యలన్నిటికీ పరిష్కారం లభిస్తుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఇంట్లో కూర్చుని బటన్ నొక్కుతున్నారని ఎమ్మెల్యేలు బయటికి రాలేని పరిస్థితి నేడు నెలకొందని నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), పార్టీ నేతలు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకర్ రెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, మామిడిశెట్టి శ్రీను,ఓగిరెడ్డి రాధ, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట ఇసుక ర్యాంపులో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - సీతానగరం : రాజంపేట ఇసుక ర్యాంపులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని రాజంపేట చెరువు వద్ద గల ఇసుక ర్యాంపులో శు క్రవారం అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్, మైనింగ్ ఏడీ విష్ణు వర్ధన్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జెపి సంస్థ నిర్వహిస్తున్న ర్యాంపు కాకుండా దొరబాబు, సుబ్రమణ్యం అనే ఇద్దరు ప్రయివేటుగా ర్యాంపు నడుపుతూ జెపీ సంస్థ పేరు పై దొంగ బిల్లులు ఇస్తున్నారని జెపి సంస్థ జిల్లా అధికారి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సోమశేఖర్ ర్యాంపులో పలువురిని విచారించారు. ఇసుక తరలిస్తున్న ల్యాండ్ ఏ రెవెన్యూ పరిధిలో వస్తుందో తెలుసుకోవాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఈబి ఎస్ఐ సత్యనారయణ, గోకవరం ఎస్ఐ శివ నాగ బాబు, విఆర్ఓ, పోలీస్ సిబ్బంది, జెపీ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక రెల్లి పేట, వెంకట రత్నాపురం ప్రాంతాల్లో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ సౌజన్యంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టే కల్చరల్ యాక్టివిటీస్ బిల్డింగ్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రజలకు వివిధ అవసరాల కోసం ఉపయోగ పడేందుకు యాక్టివిటీస్ బిల్డింగ్స్ నిర్మిస్తున్న గ్రాసిమ్ ఇండస్ట్రీస్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి అభినందించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), గ్రాసిమ్ ఇండస్ట్రీస్ యూనిట్ హెడ్ కృష్ణన్, హెచ్ ఆర్ మురళీకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళి, రాష్ట్ర బట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టి రాజు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సత్తి శ్రీనివాస రెడ్డి (ఎస్ ఎస్), ఈవో మల్లిడి విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అరెస్టు అమానుషం

విశాలాంధ్ర-కాళ్ళ: శుక్రవారం విజయ వాడలో యూ.టి. ఎఫ్ . ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్పదీక్షను ప్రభుత్వం దమననీతిని ప్రదర్శించి పోలీసుల సాయంతో అరెస్టులు చేయడం శోచనీయమని యూటీఎఫ్ కాళ్ళ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆర్.ఎం.కె.స్వామి,ఎం. శంకర్రావు అన్నారు. ఈ రోజు సంకల్ప దీక్షకు కాళ్ళ మండలం నుండి 15 మంది వెళ్లగా, వివిధ ప్రాంతాల్లో అందరినీ అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగిస్తుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ ను రద్దు చేయమని కోరడం, దానికోసం పోరాటం చేయడం నేరమా అని ప్రశ్నించారు. ఎం.ఎల్.సి లు, రాష్ట్ర జిల్లా నాయకులు 36 గంటల దీక్ష చేపట్టాల్సిన పరిస్థితి రావడం శోచనీయం అన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి పాదయాత్ర లో ఇచ్చిన హామీ ప్రకారం సి.పి.ఎస్ ను రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సి.హెచ్,పట్టిభి రామయ్య, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణంరాజు, సీనియర్ నాయకులు సత్యనారాయణ, పి.ఎస్. విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విలేఖరికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై చికిత్స పొందుతున్న ప్రజాశక్తి పత్రిక విలేఖరి తప్పెట్ల శ్రీనివాస్ కు బిజెపి నాయకులు గవరవరం గ్రామంలో శ్రీనివాస్ ఇంటి వద్ద శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు తపన పౌండేషన్ ద్వారా రూ.25 వేల నగదును అందజేశారు.ఈ సందర్భంగా

రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు, కేంద్ర రైల్వే బోర్డ్ కమిటీ మెంబర్, బొల్లిన నిర్మల కిషోర్ మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రికలో కొయ్యలగూడెం మండల విలేకరిగా పనిచేస్తున్న శ్రీనివాస్ రోడ్డు ప్రమాదానికి గురి కావడం చాలా బాధాకరమని అన్నారు. తపన ఫౌండేషన్ ద్వారా ఆయన కుటుంబానికి నగదును అందజేయడం జరిగిందని, మండల పార్టీ నాయకుల ద్వారా నిత్యావసర వస్తువులు సరుకులు కూడా అందజేస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు , కేంద్ర సెన్సార్ బోర్డు మెంబర్, ఎస్. ఆర్ .ఆర్. పి. సుభద్రాదేవి, మండల అధ్యక్షులు కట్టా సత్యనారాయణ, బొమ్మ మోహన్ రావు, చిటికెన రమేష్, బొమ్మ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై పోరాటమే మార్గం

విశాలాంధ్ర -భీమడోలు : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర రెడ్డి అన్నారు. శుక్రవారం భీమడోలు జంక్షన్‌లోని కాట్రగడ్డ మధుసూదన రావు అన్నపూర్ణ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ

నర్సింహా అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్లనే రైతాంగ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ నష్టాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారని చెప్పారు. రైతుల పంటలకు కనీస ధరలు రావడం లేదన్నారు.గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లులు బకాయిలు చెల్లించాలన్నారు. పాలకు గిట్టు బాటు ధర కల్పించాలన్నారు. ఆయిల్ పామ్ రైతులకు మొక్కలు అందించాలని, టన్ను గెలలకు రూ.20వేలు ఇవ్వాలన్నారు.నల్ల తామర పురుగుతో నష్టపోయిన మిర్చి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల నుండి ధాన్యాన్ని ఫిబ్రవరి 15 వరకు కొనుగోలు చేయాలని, రైతులకు హమాలీ చార్జీలు చెల్లించాలని కోరారు. చెరకు రైతులు ఆదుకోవాలని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు ఆపాలన్నారు. రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని, ఈ చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలని రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు జి.ప్రసాదరావు, కట్టా భాస్కరరావు,కె.జలపాలు, బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతారామయ్య, గండి రాజా, గుండపనేని సురేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె. అప్పారావు,జిల్లా కో- కన్వీనర్ వి.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుని కళ్యాణం

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల : లక్ష్మీనరసింహుని దివ్య కళ్యాణం. కనులారా వీక్షించిన భక్తజనులు భక్తి పారవశ్యం పొందారు. సుందరగిరి పరిసరాలు గోవింద నామస్మరణలతో మారు మ్రోగాయి. ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐ.ఎస్.జగన్నాధపురంలోకి శ్రీలక్ష్మీ

నరసింహస్వామివారి కళ్యాణం శుక్రవారం ఉదయం అత్యంత వైభవో పేతంగా జరిగింది. దీనికోసం సుందరగిరి కొండ దిగువబాగాన ప్రత్యేక వేదికను ఏర్పాటుచేశారు. వేదికను రకరకాల పుష్పమాలికలతో, అరటిబోదెలతో, శోభాయమానంగా తీర్చిదిద్దారు. కొండపైనుండి తొళక్కం వాహనంపై ఉత్సవ విగ్రహాలను కళ్యాణ వేదిక వద్దకు తెచ్చారు. కళ్యాణ వేదికపై అంతకు ముందే ఏర్పాటుచేసిన రజిత సింహాసనంపై స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కళ్యాణతంతు ప్రారంభించారు. ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ద్రేవస్థానం తరపున ఆలయ కార్యనిర్వాహణాదికారి వేంద్రత్రినాధరావు పట్టువస్త్రాలను అందజేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణల నడుమ అమ్మవార్ల తలపై జీలకర్ర బెల్లం ధరింపజేశారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్విహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 5వేలమంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో పతికి నటరాజ్, ఆలయ సూపరింటెం డెంట్ రమణరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా కలిగి వున్న ముగ్గురిపై కేసు

విశాలాంధ్ర-టి.నరసాపురం: అక్రమంగా నాటుసార కలిగి వున్న ముగ్గురు వ్యక్తుల పై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల టి నరసాపురం పంచాయితీ లోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా నాటుసార కలిగి వున్నారనే పక్కా సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుండి 15 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకుని,కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

కుట్టు మిషన్‌తో స్వయం ఉపాధి

విశాలాంధ్ర-టి.నరసాపురం : ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు మహిళల స్వయం ఉపాధికి దోహదపడతాయని మక్కినవారిగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బ్యాచ్ లో 30 మంది మహిళలు శిక్షణ తీసుకోనున్నారని ఆయన తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఉచిత కుట్టుమిషన్ కేంద్రం లో శిక్షణ పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ ప్రతినిధి సాయి, మాలంపాటి హరిబాబు,అత్తులూరి సత్యనారాయణ, సిరిమళ్ళ నాగార్జున, సాదు కుబేర వరప్రసాద్, దామిశెట్టి కేశవరావు ,బొప్పన నాగేశ్వరరావు ,కొమ్మరాజు వాసు, సత్ర బోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో ఉత్తమ ఫలితాలు సాంధించాలి

విశాలాంధ్ర-ఆకివీడు: ఈ సర్వే పనులు వేగవంతం చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. శుక్రవారం ఆకివీడు మండలం ఐ భీమవరం రీ సర్వే పనులు, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను జిల్లా జాయింటు కలెక్టరు అకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా ప్రతి అడుగు ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయాలని, ప్రతి రైతు జిరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయాలన్నారు. రీ సర్వే టీములు భూమి వద్దకు

వచ్చినప్పుడు ప్రతి రైతు , భూమి యజమాని హాజరై వారి భూ సరిహద్దులు రీ సర్వే టీం కు చూపించి సర్వేకు సహకరించాలని కోరారు. ఈ సర్వేను అత్యంత ఆధునిక డ్రోన్లు వినియోగిస్తున్నామని సర్వేకు అవసరమైన రోవర్లు కూడా ఇప్పటికే అన్ని గ్రామాలకు అందించామని అయన తెలిపారు. ఆకివీడు మండలంలోని 3 గ్రామాలు ఇప్పటివరకు డ్రోన్ పై పూర్తి చేయడం జరిగింది. మిగిలిన గ్రామాలు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని , అధికారులకు ,సిబ్బంది కి జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి దిశా నిర్దేశం చేశారు.జిల్లా జాయింటు కలెక్టరు వెంట ఆర్ డి వో దాసి రాజు , జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దారు వేంకటేశ్వర రావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె ఏ యస్ యస్ శ్రీనివాస రావు, యం పి డి వో శ్రీకరు,రెవిన్యూ,సర్వే , తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డగించిన రైతులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా నుండి ఆంధ్ర రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను రైతులు అడ్డగించారు. మా భూములకు సరైన గిట్టుబాటు ధర

కల్పించకుండా పంట పొలాల భూములను బలవంతంగా లాక్కొని రోడ్లు నిర్మిస్తున్నారని పొంగుటూరు గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం పొంగుటూరు గ్రామ శివారు నుండి నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డగించి ఆందోళన చేపట్టారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టే మిషనరీలు తీసుకువచ్చి రోడ్డు నిర్మాణం చేపడుతుంటే పొంగుటూరు గ్రామానికి చెందిన రైతు మోహన్ రావు జెసిబి కి అడ్డంగా పడుకోవడంతో, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు రంగప్రవేశం చేసి, మోహన్ రావు ను పోలీసుల సహాయంతో ప్రక్కకు లాగి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మా భూమి ఖరీదు 80 లక్షల రూపాయలు ఉందని, ప్రభుత్వం 20 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించిందని, మా పొలంలో బోరు, పైపులైను ఉన్నా సరే, మా పంట పొలాలను బలవంతంగా లాక్కుని రోడ్డు నిర్మిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అక్రమంగా సారా తరలిస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను శుక్రవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ ఈ బి. సీఐ, కొయ్యలగూడెం పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఏడు ద్విచక్ర వాహనాలకు,5 ద్విచక్ర వాహనాలను మాత్రమే వేలం పాటలో పాడుకున్న వ్యక్తులు దక్కించుకున్నారు.5 ద్విచక్ర వాహనాల విలువ రూ. 1 లక్ష51వేల 500 అని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ బాబురావు, చలామ్,హరి, గణేష్, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-ముసునూరు: రసాయనిక, క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించి,ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్ శ్రీనివాసరావు,జోనల్ కో ఆర్డినేటర్ జడ్‌సీ హుసన్ పేర్కొన్నారు.శుక్రవారం

మండలంలోని ముసునూరు, చింతలవల్లి ,కోర్లగుంట గ్రామాల్లోని పలువురు రైతులతో కలిసి ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు తెలుపుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల పంటల వల్లన అనారోగ్యం బారిన పడకుండా వుంటారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎల్1 పద్మ,శారమ్మ,ఎల్ 2,ఎల్ 3లు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చడానికే రాజధాని డ్రామా

విశాలాంధ్ర- ఏలూరు: రాష్ట్ర ప్రజలు మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపై చర్చించుకుంటున్న నేపథ్యంలో దాని నుంచి ప్రజల దృష్టికి మరల్చేందుకు ముఖ్య మంత్రి జగన్ విశాఖ రాజధానిగా పాలన సాగిస్తానని కొత్త డ్రామాకు తెరలేపారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి

ధ్వజమెత్తారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు 47వ డివిజన్ తంగెళ్ళమూడి నాగయ్య వాటర్ ట్యాంక్ వద్ద నుండి టీడీపీ ఇంఛార్జీ బడేటి చంటి పాదయాత్ర చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసగిస్తుందో సవివరంగా వారికి వివరించారు. భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కొలువుదీరనుందని, ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ టీడీపీ యువనేత లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రతో వైసీపీలో వణుకు పుడుతోందన్నారు. ఎన్ని రాజకీయాలు చేసినా వైసీపీ కి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బడేటి చంటి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో 47 వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని శ్రీనివాస్,జూంజు మోజెష్,అర్నెపల్లి తిరుపతి,జాబివుళ్ళ,ఇబ్రహీం, రజాక్,ఎస్‌కె బాషా,నేరుసు గంగరాజు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పాలన

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా గ్రామాల్లో సచివా లయ వ్యవస్థ ద్వారా పారదర్శ కంగా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు అంది స్తుందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నీలాద్రిపురం గ్రామంలో సచివాలయం రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను ఆవిష్కరించారు.

అనంతరం సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేప పథకాలు అందిస్తున్న ఘనత ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ రామకృష్ణ, ఏడిఏ పి. మురళీకృష్ణ, తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీరాజ్ డిఈ వేణుగోపాల్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు వాలంటీర్లు పాల్గొన్నారు.

డాల్ఫిన్‌కు పోస్టుమార్టం

విశాలాంధ్ర - పెదపూడి : ఏపత్రయం శివారు బిక్కవోలు డ్రెయిన్లో గురువారం మధ్యాహ్నం చనిపోయిన డాల్ఫిన్ చేపకు శుక్రవారం ఉదయం పోస్టుమార్టం చేసి, కాలువగట్టు ప్రక్కన గొయ్యి తవ్వి దానిలో పూడ్చివేశారు. తహసీల్దార్ టి సుబాష్, జిల్లా ఫారెస్ట్ అధికారి బివికె రాజు తెలిపిన వివరాలు ప్రకారం పశుసంవర్ధశాఖ, మత్స్యశాఖ, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో డాల్ఫిన్ చేపకు పోస్టుమార్టం నిబంధనలు ప్రకారం చేశారన్నారు. పశు వైద్యులు రాజమహేంద్రవరానికి చెందిన ఫణీంద్ర, పెదపూడికి చెందిన కిరణ్మయి, భూపాలపట్నంనకు చెందిన భరత్ పోస్టుమార్టం చేశారన్నారు. డాల్ఫిన్ ఉప్పు నీటిలో జీవిస్తుందని, బిక్కవోలు డ్రెయిన్లో కొద్దిపాటి తియ్యటినీరు, బురద తగలడంతో జీవించలేకపోయిందని వైద్యులు తెలిపారన్నారు. అనంతరం దానిని గొయ్యితవ్వి పూడ్చివేశారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో జి అంచిబాబు, పారెస్ట్ అధికారులు సిద్దార్థ, ఉపేంద్రరెడ్డి, వసంతకుమారి, మత్స్యశాఖ ఎఫ్‌ఓ సూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గారపాటి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర- కొవ్వూరు : తెలుగుదేశం పార్టీ జిల్లా రైతు ఉపాధ్యక్షులు, లయన్స్ క్లబ్స్ జోన్ చైర్ పర్సన్ గారపాటి శ్రీనివాసరావు తండ్రి గారపాటి రామచంద్రరావు (చిలకయ్య) మృతి చెందారు. వారి పార్థివ దేహాన్ని సందర్శించి మాజీ

మంత్రి కేఎస్ జవహర్ నివాళులర్పించారు. చిలకయ్య 1983 నుండి తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్నారు. గారపాటి శ్రీనివాసరావును కొవ్వూరు లయన్స్ క్లబ్ సభ్యులు, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. రామచంద్రరావు మృతి చెందినా మరొక ఇద్దరికి దృష్టి ప్రసాదించాలనే సంకల్పంతో నిడదవోలు రాజరాజేశ్వరి లయన్స్ కంటి ఆసుపత్రికి కార్నియా డొనేట్ చేశారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ఫిబ్రవరి 10 నుండి 28 వరకు జనసేన పార్టీ చేపట్టబోయే మూడవ విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు అందరూ విజయవంతం చేయవలసిందిగా పితాని బాలకృష్ణ కోరారు.

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గతంలో జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యులు మరలా రెన్యువల్ చేయించుకోవాలని కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని అనుకునే వారికి ఇదొక మంచి అవకాశం అని తెలిపారు. గతంలో క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి పేదవారికి కూడు, గూడు, గుడ్డ అందించడమే తెలుగుదేశం పార్టీ సత్సంకల్పం

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రతి పేదవారికి కూడు, గూడు,గుడ్డ అందించడమే తెలుగుదేశం పార్టీ సత్ సంకల్పమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ వద్ద వాదాలకుంట టిడిపి

గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ భోజనం ఏర్పాటు చేశారు.మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా పేదవారికి భోజనం అందజేశారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం స్థాపించి 40 సంవత్సరాలు ప్రయాణంలో 22 సంవత్సరాలు అధికారంలో ఉందని అన్నారు. దారిద్ర్య రేఖ దిగువనున్న కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెదేపాదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి (న్యూ) 15 పాయింట్స్ ప్రోగ్రాం కమిటీ మెంబర్‌గా బిషప్ జల్లి జార్జ్ పాఫప్

విశాలాంధ్ర - అంబాజీపేట : ప్రధానమంత్రి (న్యూ) 15 పాయింట్స్ ప్రోగ్రాం కమిటీ మెంబర్‌గా ప్రభుత్వ ఉత్తర్వు లను అందుకు న్నట్లు జార్జి పఫప్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట కల్వరి క్రైస్తవ ప్రార్థన మంది

రం సిపిహెచ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ జల్లి జార్జ్ పాఫప్‌కి మైనార్టీల సంక్షేమంపై, ప్రధానమంత్రి (న్యూ) 15 పాయింట్స్ ప్రోగ్రాం కమిటీ మెంబర్‌గా ప్రభుత్వ ఉత్తర్వులను డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ (డిఎంఓ) షేక్ ఇమ్రాన్ ద్వారా అందుకున్నట్లు జార్జి పాపప్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం సిపిహెచ్ మందిరంలో అభినందన సత్కార సభ సమావేశంలో బిషప్ జల్లి జార్జ్ పాఫప్ మాట్లాడుతూ క్రైస్తవ సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కమిటీ మైనార్టీ సంక్షేమ శాఖకు అనుకూలంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ సిఫార్సు మేరకు మైనారిటీస్ ఇంప్లిమెంటేషన్, డెవలప్మెంట్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు మంత్రి పినిపే విశ్వరూప్‌కి, అమలాపురం ఎంపీ చింత అనురాధకి, పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ అడపా ప్రసాద్, డాక్టర్ వి రాజ్ కుమార్, రెవ యస్ మధుసూదన్ రావు, రేవ డా జె విక్టర్ కుమార్, బిషప్ మోహన్ కుమార్, గద్దం గాంధీ, రెవ జే దీవెనలాల్, పాస్టర్ పి ప్రభు రాజేష్, గెద్దం సత్యనారాయణ, తదితర క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు. క్రైస్తవ సంఘాలు, క్రైస్తవ నాయకులు, బిషప్‌లు హర్షాతిరేకాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లిలోని శ్రీ ఉమా రామలింగేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని దేవరపల్లికి చెందిన డాక్టర్ కేశిరాజు కాశీ విశ్వనాథ ప్రారంభించారు. ఏలూరు ఆశ్రమ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కేవీ రావు డాక్టర్ సుమా వని డాక్టర్ సిహెచ్ నర్మద డాక్టర్ పి కామేశ్వరి వైద్య సేవలు అందించారు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల మానవతా సేవా సంస్థ వైద్య విభాగం చైర్మన్ బలుసు సత్యనారాయణ, అధ్యక్షులు బండి సూరి ప్రకాష్ రావు, కార్యదర్శి ఈదుపుగంటి నాగేశ్వరరావు, సంఘం గౌరవ అధ్యక్షులు కెసి రాజు, సీతారామయ్య, సంఘం ఉపాధ్యక్షుడు మాధవరం వెంకటేశ్వరరావు, పప్పు రామారావు, డి. గంగాధర్, పచ్చా రాంగోపాల్, కూచిపూడి సత్యనారాయణ , రాంబాబు ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి పి ఆర్ ఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్ నిమిత్తం ఏలూరు తీసుకెళ్తామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తెలిపారు. కేశిరాజు రాజ్ కుమార్ చీకట్ల వీర వెంకటరావు నారాయణ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలన్నీ వినియోగంలోకి తేవాలి

విశాలాంధ్ర - పెదపూడి : గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం చేకూర్చే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్. విక్టర్ తెలిపారు. ఆయన రామేశ్వరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని మెటీరియల్ రివకరీ యూనిట్‌గా ఎంపిక చేశారన్నారు. దీంతో మండలంలోని గ్రామాల్లో గల గాజు, ప్లాస్టిక్ మొదలగు వాటిని సలిపి బూడిద చేస్తారన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు బాగానే తయారు చేస్తున్నారని దీనిని రైతులకు విక్రయించాలన్నారు. సేంద్రియ సాగు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం సచివాలయంలో అధికారులు, వలంటీర్లకు సంక్షేమ పథకాలపై సమావేశం నిర్వహించారు.

ఆదిత్య బిజినెస్ స్కూల్ అదిత్-2కె 23 ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ మేనేజ్మెంట్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అదిత్-2కె23 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్. సుగుణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విడిఎం వ్యవస్థాపక

అధ్యక్షులు ఆచార్య అజిత్ కుమార్, రాక్ సెరామిక్స్ హెచ్ఆర్ హెడ్ టి. నీరజ్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలతో స్వాగత కార్యక్రమం ఎంతో అలరించింది జ్యోతి ప్రజ్వలనం తో ప్రారంభమైన కార్యక్రమంలో డాక్టర్ సుగుణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలకు అద్దం పట్టే విధంగా ఈ అదిత్ 2కె23లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గల 25 బిజినెస్ కళాశాలలకు చెందిన 450 విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. టి నీరజ్ కుమార్ మాట్లాడుతూ కష్టపడందే ఏదీ పొందలేమని, కలలు కంటే సరిపోదు వాటిని సార్థకం చేసుకోవడానికి మన నిరంతర కృషి ఎంతో అవసరమని అన్నారు ముఖ్య అతిథి ఆచార్య అజిత్ కుమార్ మాట్లాడుతూ నూతన యువ భారత్‌ను తీర్చి దిద్దడానికి డాక్టర్ సుగుణ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం గోవర్ధన్ రెడ్డి, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - మామిడికుదురు : బడుగు, బలహీన వర్గాలకు ఇదేమి ఖర్మ అని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మామిడికుదురు, ఈదరాడ గ్రామాలలో శుక్రవారం గ్రామశాఖ అధ్యక్షులు కంచి విశ్వనాథం, ఎరుబండి బాబి ఆధ్వర్యంలో జరిగిన ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో

ముఖ్య అతిథిగా మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, పరిశీలకులుగా చిటికెల రామ్మోహనరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బడుగు బలహీన వర్గాల వారి జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని గత తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో దళిత సామాజిక వర్గానికి ఇచ్చిన 27 పథకాలను వైయస్సార్సీపీ ప్రభుత్వం రద్దు చేయటమే కాకుండా, యస్‌సి, యస్‌టి సబ్ ప్లాన్ నిధులను మళ్లించడం ద్వారా దళిత సామాజిక వర్గాన్ని ఆర్థికంగాను, సామాజిక పరంగా అణగతొక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, రాజోలు నియోజక వర్గం తెలుగు రైతు అధ్యక్షులు ఈలి శ్రీనివాస్, పనసా సుజాత, ఉంద్రు శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటిబాబును సన్మానించిన వైశ్య సంఘం

విశాలాంధ్ర - గోకవరం : జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబుని గోకవరం శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గడపగడపకి వైఎస్ఆర్ కార్యక్రమంలో గోకవరంలో పర్యటిస్తున్న

శాసనసభ్యులను వైశ్య సంఘ సభ్యులు పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల వైయస్సార్సీపీ మండల అధ్యక్షుడు పార్టీ రాంబాబు, గోకవరం జడ్పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ రమేష్, సుంకర శ్రీవల్లి వీరబాబు, బత్తుల సత్తిబాబు,, బత్తుల సూరన్న, తుమ్మల చిన్నబ్బు గోకవరం మాజీ ఉపసర్పంచ్ పసుమర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మదర్ థెరిస్సా అవార్డు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన బిషప్ డాక్టర్ వెంకట సుధాకర్ కు మదర్ థెరిస్సా అవార్డు దక్కింది. ఈ విషయాన్ని అవార్డు గ్రహీత సుధాకర్ శుక్రవారం తెలిపారు. రాజమండ్రి చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు సుధాకర్ కు అవార్డు ఇచ్చి

పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుధాకర్ కు అవార్డు లభించడం పట్ల మండలంలో పాస్టర్లు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సుధాకర్ మాట్లాడుతూ అందరి కృషితో మాకు అవార్డు వచ్చిందన్నారు. నన్ను అవార్డు ఇచ్చి సత్కరించిన చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారికి సుధాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరు దృష్టి సారించడమే కాకుండా, ప్రమాదాల నివారణపై తగు జాగ్రత్తలు తూచా తప్పకుండా పాటించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని కిర్లంపూడి ఎస్సై టి రఘునాధరావు అన్నారు. రోడ్డు

భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం రవీంద్రనాథ్ బాబు, ఆదేశాల మేరకు శుక్రవారం జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి ప్రధాన రహదారులపై మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది, పలువురు గ్రామస్తులతో రోడ్డు ప్రమాదాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై మోటార్ సైకిల్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథరావు మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే 80 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల పలువురు ప్రమాదాల బారిన పడి, తలకు బలమైన గాయం అవ్వడం వల్ల ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు కుమార్, రామకృష్ణమూర్తి, పిసిలు శ్రీనివాస్, శివ, ఛారీ, రెడ్డి పలువురు పోలీస్ సిబ్బంది వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వార్డు మెంబెర్ శరకణం సంతోష్ పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : శ్రీ ఆదిత్య హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు ఆదిత్య మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రిలో 60 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 25 మందిని(కాటరేక్ట్) ఆపరేషన్ నిమిత్తం రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రికి పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు సుప్రియ, శివప్రసాద్, విజయబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర - కాకినాడ : రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చునని రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావు, కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. శ్రీనివాస రావు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా కాకినాడ ఆర్టీసీ డిపోలో శుక్రవారం స్వచ్ఛంద

రక్తదానం శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ డ్రైవర్లు రహదారి నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చునని పేర్కొన్నారు. రెడ్ క్రాస్, రోటరీ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 120మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కామరాజు, ఆర్టీసీ వైద్యశాల డాక్టర్ వీర లక్ష్మీ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పి బాలకృష్ణ, ఇన్‌చార్జి డిపో మేనేజర్ కిరణ్ కుమార్, కాకినాడ ఆర్టీసీ డిపో స్టేషన్ మేనేజర్ జి. శ్రీనివాస్, సంస్థ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర -భీమవరం: ఎపిపిఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఇతర పోటీ పరీక్షలకు తమ కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ 6వ తేదీ నుండి కోచింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నామని మరిన్ని వివరాలకు సెంటర్ కో-కన్వీనర్ పి.అమూల్యరావును గాని, 8464872037 ఫోన్ నెంబర్ లో గాని సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.